
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 28 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.00 (305.9222)	36,960	36,960
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.176 (41.4867)	33,755	57,858

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల దరి చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.. జిల్లాలో పాలనను గాడిలో పెట్టడంతో పాటు ఉద్యోగుల పనితీరులో కొంత మార్పు తీసుకొచ్చి ఆశావాహ దృక్పథంతో ముందుకువెళ్తున్నాం.. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాం.. సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీస్తూ, నేరుగా లబ్ధిదారులను కలిసి పథకాల అమలు తీరును తెలుసుకుంటున్నాం.. ప్రభుత్వ శాఖల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది పూర్తిచేసుకొని జిల్లా పాలనలో తనదైన ముద్ర వేసిన కలెక్టర్ హనుమంతరావుతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లో..

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

ప్రజల దరికి పాలన

- పక్కాగా సంక్షేమ పథకాల అమలు
- పల్లెల అభివృద్ధికి ప్రణాళికలు
- సంక్షేమశాఖలు, విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- ఆశావాహ దృక్పథంతో అడుగులు
- కలెక్టర్ ఎం.హనుమంతరావుతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా, విద్య, వైద్యం, జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాం. భూభారతి, నూతన ఆర్వోఆర్ చట్టంపై అన్ని మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు పూర్తి చేసి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. కలెక్టరేట్ సముదాయంలో జిల్లా మహిళా సమాఖ్యకు భవనం ఏర్పాటుకు కృషి చేశాం. అదేవిధంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా క్యాంటీన్లు ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తున్నాం. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతంగా పూర్తిచేశాం. జిల్లాలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికార యంత్రాంగంతో పనులు చేయించాం. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు పారిశుధ్య పనులపై దృష్టిసారించేలా చర్యలు తీసుకున్నాం. అంతేగాక తనిఖీల్లో ఆయా పనుల పురోగతిని పరిశీలిస్తున్నాం.

విద్యాసంస్థలు, హాస్టళ్లలో తనిఖీలు

ప్రభుత్వ విద్యా సంస్థలను తనిఖీ చేస్తూ రాత్రి బస చేస్తున్నాం. అక్కడి వసతులు పరిశీలించడంతోపాటు విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికపై మార్గదర్శకం చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా కృషి చేశాం. గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 200 మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేశాం. విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించాం. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలోని 675 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగు నీరు, వంట గదులు, సీసీ కెమెరాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రతిరోజు పాఠశాలలను తనిఖీ చేస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించేలా కృషి చేస్తున్నాం. పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు తగిన సహాయం అందిస్తున్నాం. నారాయణపూర్ మండలం కంకణాలగూడెంలో నిరుపేద విద్యార్థి భరత్ చంద్రకు ఆర్థిక సహాయం కింద కుటుంబానికి నెలనెలా ఇంటి సామగ్రి, విద్యార్థి చదువుకు రూ.5వేల ఆర్థిక సహాయం అందించాం.

నెలలో ఒకరోజు హాస్టల్ నిద్ర

సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు అధికారులు నెలలో ఒకసారి హాస్టళ్లలో బస చేయాలని ఆదేశించాం. సంక్షేమశాఖల అధికారులతో పాటు మండల ప్రత్యేకాధికారులు విద్యార్థులతో మమేకమై గుర్తించిన సమస్యలపై నివేదిక అందజేస్తున్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల చదువు తీరును పరిశీలించి వారు లక్ష్యాన్ని చేరేలా ప్రోత్సహిస్తున్నాం.

వైద్య సేవలపై నజర్

ప్రభుత్వ వైద్యశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. వైద్యులంతా సకాలంలో ఆస్పత్రులకు హాజరయ్యేలా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్నాం. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి, అన్ని మండలాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పల్లె దవాఖానాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నాం. ఆస్పత్రి ఆవరణ, లోపల పారిశుధ్యం, మందులు, వ్యాక్సిన్ల నిల్వలు, ఓపీ, ఇన్‌పేషెంట్ల వివరాలను పరిశీలిస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు తెలుసుకొని, మందుల పంపిణీపై ఆరా తీస్తున్నాం. విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు సస్పెండ్ చేస్తున్నాం. నిర్లక్ష్యం వహించే, అవినీతి అధికారులపై కఠిన చర్యలు ...

- మిగతా 8వ పేజీలో...

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

- 82దుకాణాలకు ఉత్కంఠగా సాగిన లాటరీ ప్రక్రియ
- దుకాణాలు దక్కించుకున్న వారిలో ఆనందం
- దక్కనివారు తిరుగుముఖం



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ ఎం.హనుమంతరావు

యాదాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు పూర్తయింది. 2025-27 సంవత్సరానికి 82 దుకాణాలకు సోమవారం భువనగిరిలోని సోమరాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో లక్కీడ్రా ప్రక్రియను కలెక్టర్ ఎం.హనుమంతరావు సమక్షంలో నిర్వహించారు. జిల్లాలో మొత్తం 82 మద్యం దుకాణాలకు 2,776 దరఖాస్తులు వచ్చాయి. 82 మద్యం దుకాణాల్లో 29 రిజర్వేషన్ కేటగిరీలకు కేటాయించారు. జిల్లాలో గౌడలకు 15శాతం (21దుకాణాలు), ఎస్సీలకు 10శాతం (7దుకాణాలు), ఎస్టీలకు 5శాతం(ఒక దుకాణం) కేటాయించారు. గౌడ సామాజిక వర్గానికి జిల్లాలోని రాయిగిరి, అనాజీపూర్, చీకటిమామిడి-2, పోచంపల్లి-1, బట్టుగూడెం, బొమ్మలరామారం, పిలాయిపల్లి,చౌటుప్పల్-2,3,5, నారాయణపురం-1, 2, సర్వేల్, యాదగిరిగుట్ట-1, 2, 5, ఆలేరు-2, 3, 4,ముత్తిరెడ్డిగూడెం, మాదాపూర్ దుకాణాలను కేటాయించారు.ఎస్సీ కేటగిరీకి మరియాల,జూలూరు, చాడ,రాజాపేట-1, రుస్తాపూర్, గుండాల-1,2,ఎస్టీ కేటగిరీకి భువనగిరి మునిసిపల్ హెచ్‌బీ కాలనీ ఎదురుగా ఉన్న 8వ నెంబర్ దుకాణం కేటాయించారు. మిగతా 53 దుకాణాలు జనరల్ కేటగిరీలో ఉన్నాయి.

ఉత్కంఠగా సాగిన లాటరీ

భువనగిరిలో నిర్వహించే లాటరీ ప్రక్రియకు ఉదయం 10గంటల నుంచే మద్యం వ్యాపారులు పట్టణానికి చేరుకున్నారు. ఎంట్రీ పాస్‌తో పాటు గుర్తింపుకార్డు

- మిగతా 8వ పేజీలో...

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ



'ప్రజావాణి'లో వినతులు తీసుకుంటున్న జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'ప్రజావాణి'లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.జయమ్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 69 దరఖాస్తులు తీసకున్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృతిక, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఏవో జగన్మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

- అక్రమంగా గోవుల రవాణా, గోవుల కళేబరాలను తరలించే వాహనాలు ఇటీవల అధికమయ్యాయని, వాటి కట్టడికి గోరక్షణ చట్టం అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు.
- భువనగిరిలో ఐకేపీ కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ వినతిపత్రం అందజేశారు.
- స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ మహిళా సభ్యుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న వీవోఏను తొలగించాలని యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ మహిళా సంఘాల సభ్యులు వినతిపత్రం అందజేశారు.

రూ.200కోట్లతో మండల అభివృద్ధి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ప్రభుత్వ కార్యాలయాలకు భూమి పూజ



మోటకొండూరులో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ ఆయిలయ్య

మోటకొండూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రూ.200కోట్లతో మోటకొండూరు మండలాన్ని అభివృద్ధి చేస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ వంగపల్లి-కప్రాయపల్లి వరకు బీటీ డబుల్ రోడ్డుకు రూ.97.61కోట్లు, తహసీల్దార్, మండలపరిషత్ కార్యాలయాలకు రూ.10కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరు నెలల్లో నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నూతనంగా ఏర్పడిన మోటకొండూరు మండలాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందన్నారు. మండలంలో 3,650 రేషన్ కార్డులను ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఇద్దరు లిల్లీపుట్లు గంగిరెద్దుల్లా హైదరాబాద్‌లో ఓట్ల కోసం తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. గంధమల్ల ప్రాజెక్టు ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. బీఆర్ఎస్ కుటుంబ గొడవలతో నాలుగు దిక్కులుగా విడిపోవడం ఖాయమన్నారు. బావ, బామ్మర్ది పదేళ్లల్లో లక్షల కోట్లు దోచుకొని రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో ఒక్క బీసీ ఎమ్మెల్యే ఉంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్లలో ఆలేరును అధోగతి పట్టించారని, కాంగ్రెస్ అభివృద్ధిచేస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారు. మోటకొండూరును దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అన్ని స్థానాల్లో గెలిపించుకునేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య 240 సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.13.73లక్షల చెక్కును అందజేశారు. 50మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ , అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో నాగిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీవో ఇందిర, యెల్లంల సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, బుగ్గ కొమురయ్య, భూమండ్ల శ్రీనివాస్, తండ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

(ఆంధ్రజ్యోతి, భువనగిరి కలెక్టరేట్): ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 329 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 90లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తామన్నారు. వర్షాల నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ధాన్యం వచ్చిన వెంటనే తేమ శాతం చూసి నిల్వ చేయకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుచేసిన 48 నుంచి 72 గంటల్లోగా రైతు ఖాతాలో నగదు జమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో నాగిరెడ్డి, పౌరసరఫరాలశాఖ అధికారి రోజారాణి, డీఎం హరికృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం, పత్తి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. తుపాను, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం, పత్తి కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అవసరమైన ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు సమకూర్చుకోవాలని సూచించారు. తుపాను తీవ్రత తగ్గే వరకు వరి నూర్పిడి పనులు నిలిపేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం తడిసి రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు 'కపాస్ కిసాన్' యాప్‌లో రైతుల వివరాలు నమోదుచేసేలా వ్యవసాయాధికారులు తోడ్పాటు అందించాలన్నారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, సన్న ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పౌరసరఫరాలశాఖ అధికారి రోజా రాణి, డీఎం హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● కార్తీకం.. శుభకరం



కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాయంత్రం ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు. 7

వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దు

మార్కెట్ చైర్‌పర్సన్ విమల వెంకటేశ్వర్లు

మోత్కూరు, అడ్డగూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని మోత్కూరు మార్కెట్ చైర్‌పర్సన్ నూనెముంతల విమలవెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని అనాజీపురం, దత్తప్పగూడెం, దాచారం, అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామంలోని జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు పత్తిని తేమ లేకుండా ఆరబెట్టి, 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. 8 నుంచి 12శాతం లోపు తేమ ఉన్న పత్తినే కొనుగోలు చేస్తారని, నాణ్యతా ప్రమాణాలు ఉన్న పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8,110 చెల్లిస్తారన్నారు. కార్యక్రమాల్లో మోత్కూర్ సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, పోచం జగన్, ఎండీ.సమీర్, కె.లలిత, బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమయ్య, బొడిగ నర్సింహ, కాంగ్రెస్ అడ్డగూడూరు మండలాధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, తదితరులు పాల్గొన్నారు.

అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు

నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ అయిలయ్య



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా చిన్నటేకూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల మండలం వస్తాకొండూరు గ్రామానికి చెందిన అనూషరెడ్డి(22) మృతిచెందటంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా అనూషరెడ్డి ఈ నెల 16వ తేదీన స్వగ్రామమైన వస్తాకొండూరు గ్రామానికి వచ్చి తిరిగి బెంగళూరు వెళుతుండగా, ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం మృతదేహానికి స్వగ్రామంలో కన్నీటి వీడ్కోలు నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

6

- (ఆంధ్రజ్యోతి-గుండాల)


పోలీసులు ప్రజారక్షకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజా రక్షకులని భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎన్.రమేశ్ అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా సోమవారం భువనగిరిలో శ్రీరాంతడాక్, భక్తభజన మండలి, జైభీమ్ ఆటో యూనియన్, నవభారత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించి స్మారక స్తూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ భద్రత కోసం సైనికులు ప్రాణత్యాగాలకు సిద్ధంగా ఉంటే ప్రజల భద్రత, పరిరక్షణకు పోలీసులు ప్రాణత్యాగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మీనర్సయ్య, లక్ష్మీనారాయణ, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేశ్

స్వచ్ఛ పురస్కారాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

డీఈవో సత్యనారాయణ

భువనగిరి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలలు స్వచ్ఛ పురస్కారాలు సాధించాలని డీఈవో సత్యనారాయణ అన్నారు. పలు అంశాలపై రేటింగ్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హరిత విద్యాలయం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాలోని 819 పాఠశాలలకు సంబంధించిన అంశాలను సోమవారం రాయిగిరి జడ్పీ హెచ్ఎస్‌లో పరిశీలన నిర్వహించారు. సుమారు 50 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులను పరిశీలించి 380 పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పాఠశాలల నిర్వహణలో ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని, పరిశోధన, నూతన ఆవిష్కరణల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి పి.లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.అండాలు, మాస్టర్ ట్రైనర్లు ఆర్.శ్రీనివాస్, ఎన్.కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో.. మద్యం దుకాణం → దక్కిందోచ్


యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో లక్కీడ్రా విజేత ఆనందం

ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన విజయం వరించింది. మద్యం టెండర్లకు నిర్వహించిన లక్కీడ్రాలో పలువురు ఎంపికయ్యారు. రెండేళ్లపాటు మద్యం దుకాణాలు దక్కించుకున్న టెండరుదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సోమవారం మద్యం షాపులకు లక్కీడ్రా నిర్వహించారు. డ్రా నిర్వహించే ప్రదేశాలు సందడిగా మారాయి. టెండర్‌దారులు, వారి కుటుంబ సభ్యుల రాకతో వాహనాల సందడి నెలకొంది. ఆ సమీప ప్రదేశాలు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఎలికట్టె భరత్-శ్రావణి దంపతులు రెండు దుకాణాలు దక్కించుకోవడం విశేషం.


నల్లగొండ జిల్లాకేంద్రంలో విజేతల ఆనందం


నల్లగొండలో డ్రాలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు


నల్లగొండలో డ్రాలో పాల్గొనేందుకు వచ్చిన వారి వాహనాలు


నల్లగొండలో డ్రా అనంతరం వెనుదిరిగిన మహిళలు


సూర్యాపేటలో లక్కీ డ్రాలో రెండు దుకాణాలు దక్కించుకున్న భార్యాభర్తలు ఎలికట్టె భరత్-శ్రావణి

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

రామన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు సోమవారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. కక్కిరేణి గ్రామానికి చెందిన కన్నెబోయిన నరసింహ గేదెలను మేపుతుండగా విద్యుత్ తీగలు తెగి గేదెలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి.

బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ఓ వరం

నల్లగొండ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ఓ వరంలాంటిదని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి ట్రేస్‌చేసి రికవరీ చేసిన 47 ఫోన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు పాస్‌వర్డ్‌లు పటిష్టంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మహిళల మెడలో పుస్తెలతాడు చోరీ


బైక్‌పై పారిపోతున్న దొంగలు

త్రిపురారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ జరిగిన సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కైగురి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఉమ్మడి శకుంతల పొలానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి పుస్తెలతాడును లాక్కొని పరారీ అయ్యారు. శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

శాలిగౌరారం: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసును చోరీ చేసిన సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది.శాలిగౌరారం ఎస్ఐ డి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన మన్నె శిరీష కుటుంబసభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 3 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో గాయాలు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో ఏడేళ్ల విద్యార్థి గాయపడిన సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సోమవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్ బోర్డుకు చెందిన లావూరి నాగరాజు కుమారుడు హర్షవర్ధన్ పాఠశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా, వీధికుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ సంఘటనలో బాలుడు హర్షవర్ధన్ తల, కంటిపై బలమైన గాయాలయ్యాయి.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓ విద్యార్థిని కుక్కలు గాయపరిచాయి. గ్రామానికి చెందిన సిర్పంగ భరత్‌కుమార్ పాఠశాల గదిలోంచి బయటకు వస్తుండగా మోచేతిపై దాడి చేసి గాయపరిచాయి.

సాగర్ కాల్వలో మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం కురియతండా వద్ద సాగర్ కాల్వలో గల్లంతైన వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఈ నెల 25న తండాకు చెందిన ధనావత్ ద్వారజన్(80) దుస్తులు ఉతకడానికి సాగర్ ఎడమకాల్వలోకి దిగింది. ఈ క్రమంలో పట్టుతప్పి కాల్వలోకి జారిపడి గల్లంతైంది. ఆమె ఆచూకీ కోసం గాలిస్తుండగా సోమవారం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

మునగాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 11 మందిని పోలీస్‌లు అరెస్ట్ చేసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న మండలంలోని నర్సింహులగూడెం గ్రామశివారులో రేకుల షెడ్‌లో జూదం ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు తెలిపారు. కమ్మంపాటి అశోక్, కమ్మంపాటి శ్రీనివాస్, చింతమళ్ల ప్రభుదాస్, షేక్ సైదా, ఉయ్యాల కాటంరాజు, బెజవాడ వెంకన్న, ముంత కృష్ణ, జుట్టుకొండ రామారావు, బొల్లెద్దు రామకృష్ణ, కేశబోయిన నాగరాజు, బొల్లం సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక లారీని పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరు నుంచి అనుమతి లేకుండా హైదరాబాద్‌కు లారీలో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీ డ్రైవర్ లుక్క నాగరాజు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వైన్స్ దుకాణంలో స్వల్పంగా మంటలు

మోత్కూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలో ఆర్‌ఎస్ వైన్స్‌లో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మూసి ఉన్న దుకాణం నుంచి బయటికి పొగ రావడంతో ఉదయం వేళ ఇరుగు పొరుగు గమనించి దుకాణ యాజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే దుకాణం వద్దకు చేరుకొని మంటలు ఆర్పారు. దుకాణంలో విద్యుత్ సరాఫరాను నియంత్రించే స్టెబిలైజర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని యజమాని తెలిపారు.

పేదల బియ్యం.. పెద్దలదందా

- దేవరకొండ డివిజన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా
- అధికారులు తనిఖీలు చేసినా ఆగని వైనం

దేవరకొండ డివిజన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సంబంధిత డీలర్లు, రేషన్‌కార్డు వినియోగదారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా అక్రమ రవాణా ఆగడంలేదు. పౌరసరఫరాలశాఖ, పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా రవాణా అవుతున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నా, బియ్యం అక్రమ రవాణా ఆగడంలేదు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణం.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)



దేవరకొండలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం(ఫైల్)


దేవరకొండలో గోదామును తనిఖీ చేస్తున్న ఆర్డీవో రమణారెడ్డి (ఫైల్)

నిరుపేదల కోసం ప్రభుత్వం ఉన్నతమైన ఆశయంతో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుంది. దేవరకొండ డివిజన్‌లోని మండలాల్లోని రేషన్ దుకాణాలకు ప్రధాన గోదాం నుంచి 115,22 క్వింటాళ్లు, 230 రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కానీ కొంతమంది డీలర్లు వినియోగదారుల నుంచి బియ్యాన్ని కిలోకు రూ.15నుంచి రూ.16వరకు అందజేసి బియ్యాన్ని కొనుగోలు చేసి వ్యాపారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులు, దళారులు రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించి రూ.25 నుంచి 30వరకు విక్రయిస్తున్నారు. తాజాగా ఈ నెల 24న చింతపల్లి మండలం నసర్లపల్లి నుంచి వాహనంలో సంపతయ్య, మరియాబి, డ్రైవర్ శివలు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తికి తరలిస్తుండగా దేవరకొండ పట్టణ శివారులో సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 20క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసి ముగ్గురుపై కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 14న నాంపల్లి మండలం నర్సింహులగూడెం రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిలువ ఉండడంతో డీటీసీఎస్ రఘునందన్ తనిఖీలు చేసి, 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని మిల్లును సీజ్ చేశారు.

కేసులు నమోదు.. బియ్యం సీజ్ చేస్తున్నా..

దేవరకొండ డివిజన్‌లో చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి, మండలాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. గతంలో దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ మండలం తెలుగుపల్లిలో వినియోగదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకొని శ్రీను అనే వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఇద్దంపల్లి నుంచి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిలు తనిఖీలు చేపడుతున్నా, అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. దేవరకొండ మండలానికి చెందిన కొంతమంది డీలర్లు బొలెరో వాహనాలను కొనుగోలుచేసి సొంత వాహనాల్లోనే బియ్యాన్ని నాగర్‌కర్నూల్, చారకొండ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీస్, పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కదారిపట్టిస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం. రేషన్ డీలర్లు సన్నబియ్యాన్ని వినియోగదారులకు ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడితే డీలర్‌షిప్ రద్దు చేస్తాం. వినియోగదారులు బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే రేషన్‌కార్డులు రద్దుచేస్తాం. ఒకే వ్యక్తి రెండు సార్లు పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తాం.

ముబిన్, డీటీసీఎస్, దేవరకొండ

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. కేతేపల్లి మండలంలో ఒకరు, భువనగిరి మండలంలో ఇద్దరు సోమవారం మృత్యువాతపడ్డారు.


ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు


బయ్యు పాపయ్య (ఫైల్)


చెక్క రమేష్(ఫైల్)

కేతేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి, నాలుగు గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్)మండలం మిడతనపల్లి గ్రామానికి చెందిన బయ్యు పాపయ్య(50) అదే గ్రామానికి చెందిన పరాల గంగయ్య, పరాల మహేష్‌తో కలిసి కొద్దిరోజుల క్రితం తమ గొర్రెల మందను తీసుకొని మేతకోసం నల్లగొండ జిల్లా కేంద్ర పరిసరాల్లోకి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం సమీపంలో కొన్ని గొర్రెలు హైవే మీదకు పరుగెత్తడంతో పాపయ్య వాటిని పక్కకు కొడుతుండగా అదే సమయంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళుతున్న కారు గొర్రెలను, పాపయ్యను ఢీకొట్టి ముందుకు వెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో పాపయ్యతోపాటు మరో నాలుగు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాపయ్యను నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పాపయ్యకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పాపయ్య కుమారుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని కేతేపల్లి ఎస్ఐ సతీష్ వివరించారు. కాగా మృతుడు పాపయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో..

భువనగిరి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిలో సోమవారం వేర్వేరు ఘటనలో ఇరువురు మహిళలు మృతి చెందారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎన్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45-50 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం స్థానిక హైదరాబాద్ చౌరస్తా వద్ద లభించింది. మృతురాలు ఒంటిపై బూడిద రంగు చీర, గులాబీ రంగు జాకెట్టు ఉన్నాయి. మృత దేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచారు. మరో ఘటనలో లక్ష్మీ (60) అనే మహిళ బస్టాండ్‌లో అనారోగ్యంతో ఉండడాన్ని గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె ఒంటిపై పసుపు రంగు చీర, తెల్ల రంగు జాకెట్టు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతదేహాల ఆచూకీ కోసం సెల్ నెంబర్లు ఎస్ఐ నరేశ్ సెల్:8712662491, పోలీస్ స్టేషన్ నెంబర్ సెల్:8712662803, ఎస్‌హెచ్‌వో సెల్:8712662471కు సంప్రదించాలని సూచించారు.

పాముకాటుకు గురై...

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన చెక్క రమేష్ (34) ఈ నెల 13న తన వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా, పాము కాటేసింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమేష్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. రమేష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అతని భార్య ప్రస్తుతం గర్భిణిగా ఉంది. ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల గణేష్ ఆధ్వర్యంలో సభ్యులు రమేష్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూచిపూడి నృత్యంలో ఉచిత శిక్షణ

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఉచితంగా అందించే కూచిపూడి నృత్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య భవన్ అధ్యక్షులు భాస్కర్, నాంపల్లి భాగ్య కోరారు. నృత్యం నేర్చుకోవాలని తపన ఉండి, ఆర్థికంగా వెనుకబడిన వారు రామగిరిలోని కనకదుర్గ ఆలయ సమీపంలోని ఆర్యవైశ్య భవన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి 6.30గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులు హాజరుకావొచ్చని తెలిపారు.

శివలీలారెడ్డికి మదర్‌థెరిస్సా అవార్డు

కనగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన న్యాకంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీలారెడ్డిని మదర్‌థెరిస్సా అవార్డు వరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తుపల్లి పట్టణంలోని మస్తాన్ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మదర్ థెరిస్సా అవార్డును ప్రదానం చేశారు. శివలీలారెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా శివలీలారెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిస్సా అవార్డును అందుకోవటం ఆనందంగా ఉందన్నారు.

అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు

- మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల నివాళి




అనూషరెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అయిలయ్య

గుండాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంలో సజీవ దహనమైన మహేశ్వరం అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరుకు అనూషరెడ్డి మృతదేహాన్ని తీసుకొచ్చారు. అయితే ప్రమాదం జరిగిన తీరుతో అనూషరెడ్డి మృతదేహాన్ని గుర్తించడం కష్టమైంది. అనూషరెడ్డి తల్లిదండ్రులు విజిత, శ్రీనివాస్‌రెడ్డిల రక్త నమూనాలు తీసుకుని డీఎన్ఏ పరీక్ష చేసి అధికారులు అనూషరెడ్డి మృతదేహాన్ని గుర్తించి వస్తాకొండూరులోని బంధువులకు అప్పగించారు. అయితే సోమవారం అనూషరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. అల్లారు ముద్దుగా పెంచుకుతున్న తమ కుమార్తె మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఇదిలా ఉంటే అనూషరెడ్డికి తెలంగాణ ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆ సొమ్ము పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరామర్శించిన మంత్రి, ఎంపీ

బస్సు ప్రమాదంలో మృతి చెందిన అనూషరెడ్డి కుటుంబాన్ని సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పరామర్శించారు. వస్తాకొండూరులోని అనూషరెడ్డి ఇంటికి చేరుకొని అనూషరెడ్డి తల్లిదండ్రులు విజిత, శ్రీనివాస్ రెడ్డిలకు ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా అనూషరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడి నుంచి గంజాయి స్వాధీనం


గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భూదాన్‌పోచంపల్లిలో యువకుడి నుంచి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముక్తాపూర్ గ్రామనివాసి మునుకుంట్ల శివకుమార్ బైక్‌పై గంజాయి తీసుకెళ్తుండగా సోమవారం పట్టుకున్నారు. అతని నుంచి 80 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీవోకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మర్రిగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల ఎంపీవో రవికుమార్ కారును ఆర్టీసీ బస్సు ఢీకొనగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధుల నిమిత్తం సోమవారం మర్రిగూడ మండలానికి సొంత కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో సూపర్ డీలక్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో కారు బోల్తా పడినప్పటికీ కారు డ్రైవింగ్ చేస్తున్న తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, స్వల్ప గాయాలతో బయటపడడం వల్ల తృటిలో పెను ప్రమాదం తప్పినట్లు ఎంపీవో తెలిపారు. స్వల్ప గాయాలతో విధులకు హాజరైన ఎంపీవోను వివిధ శాఖలకు చెందిన అధికారులు పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

యాద'గిరి'పై కార్తీక దీపోత్సవం



యాదగిరిగుట్ట: శివాలయ ప్రాంగణంలో దీపోత్సవంలో అధికారులు, భక్తులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు కార్తీక దీపోత్సవం నిర్వహించి, మొక్కులు చెల్లించారు. దేవాదాయ శాఖ అనుమతితో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అధికారులు నిర్వహించారు. భక్తుల్లో ఆధ్యాత్మికతను, సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో దేవస్థానం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. కాగా ప్రధానాలయంలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శివాలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జీ డీఈవో జూసెట్టి కృష్ణ, ఏఈవో గజ్వేల్ రఘు, ప్రధాన అర్చకుడు బట్టర్ సురేంద్ర చార్యులు బృందం, పర్యవేక్షకుడు సీతారామాచార్యులు పాల్గొన్నారు.

ఆళ్వార్లకు పురప్పాట్టు సేవ : లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం మనవాళ మహాముని తిరునక్షత్రోత్సవాలు పండితులు వైభవంగా నిర్వహించారు. ఆళ్వార్లలకు పురప్పాట్టు సేవ చేస్తూ ప్రబంధ పాశురాలను పఠనంతో మాడవీధుల్లో ఊరేగించారు. కలెక్టర్ హనుమంతరావు, ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి కృష్ణ, ఏఈవో గజ్వేల్ రఘు, పర్యవేక్షకుడు సీతారామాచార్యులు బృందం, ప్రధాన అర్చకుడు బట్టర్ సురేంద్రాచార్యులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహుని క్షేత్రంలో నిత్య కల్యాణం వైభవంగా నిర్వమించారు. కార్తీక సోమవారం కావడంతో శివాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

భూనిర్వాసితుల గోడు పట్టదా?



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాతీయ రహదారి-930 భూనిర్వాసితులు (ఫైల్)

- ఆందోళనలో గౌరెల్లి-భద్రాచలం జాతీయ రహదారి నిర్వాసితులు
- బాధితులకు అందని పరిహారం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో భూ నిర్వాసితుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పరిహారం కోసం వారు ఏళ్ల తరబడి ఎదురు చూస్తూనే ఉన్నారు. గౌరెల్లి - భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి-930 యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల మీదుగా వెళుతోంది. ఈ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులు, రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదు. ఎంతో కాలంగా నిర్వాసితులు అధికారులను కలిసి విన్నవించుకున్నా వారి మొర ఆలకించడంలేదని నిర్వాసితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు 'బుక్ వాల్యూ' ప్రకారం కాకుండా బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారం రేటు చెల్లించాలని గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి భూనిర్వాసితుల కమిటీ తరఫున ఇప్పటికే కలెక్టర్‌తోపాటు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనేకసార్లు సమావేశాలు నిర్వహించినా, సమస్య పరిష్కరించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిసాగుపై ఆధారం

జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల నుంచి మూసీ ప్రవహిస్తుండడంతో ఆ నీటిని ఆధారం చేసుకుని ఆయకట్టులోని రైతాంగం పూర్తిగా వరి సాగుపై ఆధారపడింది. బహిరంగ మార్కెట్లో ఈ ప్రాంతంలో భూమి ధర ఎకరం రూ.1కోటి 20 లక్షల నుండి రూ. 3కోట్ల వరకు పలుకుతుందని నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఇలాంటి అతి ఖరీదైన భూములను రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేసిన ప్రభుత్వం ఎకరం రూ.24 లక్షలు మాత్రమే ఇస్తామనడం వల్ల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరతరాలుగా సాగుచేసుకుంటున్న రైతుల వ్యవసాయ భూములను జాతీయ రహదారి నిర్మాణం కోసం శాశ్వతంగా ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని బాధితులు తమ గోడు వినిపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం భూనిర్వాసితులకు నష్టపరిహారం కోసం ఎందుకు ఖర్చు పెట్టదని వారు ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం రేటు చెల్లించకపోతే భూమికి - భూమి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఎనిమిది ఎకరాల సాగుభూమిని కోల్పోతున్నా



గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి నిర్మాణంలో మా భూమి నుంచి అధికంగా 8 ఎకరాల మేరకు భూమిని కోల్పోతున్నా. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలి. కనీసం ఎకరా రూ. 40 లక్షలు తగ్గకుండా చెల్లించాలి.

- శేఖర్‌రెడ్డి, భూనిర్వాసితుడు, దంతూరు

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి



భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన నా కుటుంబ సభ్యులకు సంబంధించిన మొత్తం 3 ఎకరాల 21 గుంటల భూమిని కోల్పోతున్నాం. ఇందుకు ప్రభుత్వం ఎకరాకు అతి తక్కువగా రూ.24 లక్షలు మాత్రమే చెల్లిస్తామని ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్ ధర చొప్పున ఎకరాకు 60 లక్షలు కనీసం చెల్లించాలి. ప్రభుత్వం అందించే అరకొర సాయం ఇప్పటికీ అందలేదు.

- భూపాల్‌రెడ్డి, కనుముకుల, భూనిర్వాసిత రైతు

భూసేకరణ చేసి..

రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిలాయిపల్లి, జగత్‌పల్లి, జూలూరు, పోచంపల్లి, మెహర్‌నగర్, భీమనపల్లి, కనుముకుల, దంతూరు, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, సంగెం, పొద్దుటూరు, రెడ్ల రేపాక, లోతుకుంట గ్రామాల్లో భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం 15 గ్రామాల్లో 455 ఎకరాల భూసేకరణ చేసింది. 42 కిలోమీటర్ల పొడవున జిల్లా మీదుగా జాతీయ రహదారి నిర్మాణం చేపట్టనుంది. భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లిలో 30-02 ఎకరాలు, జగత్‌పల్లిలో 10-06 1/2, పోచంపల్లిలో 53-19, జూలూరులో 15-39 1/2, భీమనపల్లిలో 23-07, మెహర్‌నగర్‌లో 8-07 1/2, కనుముకులలో 26-01 1/2, దంతూరులో 25-05, వంకమామిడిలో 20-26, ధర్మారెడ్డిపల్లిలో 16-14 ఎకరాల చొప్పున మొత్తం 229.08 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ రేటులో సగం ధరనైనా కట్టించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇప్పటి వరకు భూనిర్వాసితులకు పరిహారం అందలేదు. ఇప్పటికైనా సత్వరమే భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సిందిగా కోరుతున్నారు.

14 ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలకు 353 దరఖాస్తులు

- నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన
- నవంబరు 10న ఫైనల్ మెరిట్ లిస్టు



దరఖాస్తులు చేసుకుంటున్న అభ్యర్థులు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఖాళీగా ఉన్న 14 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగాలకు అభ్యర్థులు సోమవారం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, స్టాఫ్ నర్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అర్హతతో కమ్యూనిటీ హెల్త్‌లో ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చేసిన వారికి అర్హత కల్పిస్తూ ఈ నెల 23 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఖాళీగా ఉన్న 14 పోస్టులకు గాను దరఖాస్తుల స్వీకరణ ముగింపు సమయానికి సుమారు 353 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను నేటి నుంచి ఈ నెల 31 వరకు పరిశీలించి, నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు ప్రొవిజినల్ మెరిట్ లిస్టు ప్రదర్శించడంతో పాటు అభ్యంతరాలు, ఆక్షేపణలు స్వీకరించనున్నారు. నవంబరు 10న ఫైనల్ మెరిట్ లిస్టును ప్రదర్శించి సర్టిఫికెట్ పరిశీలన కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

ఆ ముగ్గురు నేతలపై కేసు నమోదుచేయాలి



యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్ నేతలు తన్నీరు హరీష్‌రావు, సంతోష్‌రావు, నవీన్‌రావులపై కేసు నమోదుచేసి విచారణ చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరారు. సోమవారం ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సీఐ బొడ్డుపల్లి భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను తప్పుదోవ పట్టించి 10సంవత్సరాలు తెలంగాణను దోచుకున్న ఆ ముగ్గురు నేతలపై కేసు నమోదు చేయాలన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపని కవిత అధికారం పోయిన తరువాత వారి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. హరీష్‌రావు, సంతోష్‌రావు, నవీన్‌రావులు కలిసి సంపదను దోచుకున్నారని ఆమె చేసిన ఆరోపణలపై బీఎన్ఎస్ యాక్టు 173 ద్వారా విచారణ జరిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉండేదన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సంపదను దోచుకున్న బీఆర్ఎస్ నాయకులు రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై చిల్లర ఆరోపణలు చేయడం అవివేకమని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించినప్పటికీ బుద్ధిరాలేదని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరి సత్తా ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పట్టణ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, బందారపు భిక్షపతిగౌడ్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్, హేమేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం

- ప్రజాధనం వృథా
- అడుగు ముందుకు పడని ప్రభుత్వ భవన నిర్మాణాలు



పునాది దశలోనే ఉన్న చింతలపాలెంట తహసీల్దార్ కార్యాలయం

చింతలపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాల పనులు పునాది దశలోనే నిలిచిపోయాయి. మండలాల పునర్విభజనలో భాగంగా చింతలపాలెం కొత్త మండలంగా ఏర్పడింది. ఈ కొత్త మండలానికి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అవసరం కావడంతో అప్పటికప్పుడు తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్, వ్యవసాయ శాఖల భవనాలు అద్దెకు తీసుకొని ఆ భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నా రు. ఆ గదులు ఇరుకుగా ఉండటంతో కూర్చునేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఆరుబటయ ఎండా, వానకు తడుచుకుం టూ నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ భవనాకు నెలకు రూ. వేలల్లో అద్దె చెల్లిస్తున్న రికార్డులు భద్రపర్చేందుకు సరైన స్థలం లేదు. కొన్నిచోట్ల మూత్రశాలలు లేక సిబ్బంది అవస్థ లు పడుతున్నారు. అతికష్టం మీద అధికారులు, సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. దీంతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండ ల అభివృద్ధిని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందులో భాగంగా మండలానికి సొంత భవనాలు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్ కార్యాలయం రూ.2.60 కోట్లు, ఎంపీడీవో కార్యాలయానికి రూ.2.98కోట్లు, పోలీస్‌స్టేషన్‌కు రూ.2.38 కోట్లు మంజూరుచేసి, శంకుస్థాపన శిలాఫలకం వేసి ఏడాదికాలం పూర్తవుతున్నా పునాది స్థాయిలోనే ఈ భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కాంట్రాక్టర్లు టెండ ర్ల ద్వారా కాంట్రాక్టును దక్కించుకున్న నిర్మాణ పనులు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతం జిల్లా కేంద్రానికి సుమారు 80 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇటువైపు ఆ శాఖకు సంబంధించిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే దృష్టి సారించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గతేడాది నవంబర్‌లో శంకుస్థాపన

చింతలపాలెం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతేడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కార్యాలయాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో ఇప్పుడు ఉన్న అద్దె భవనాల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పనులు వేగంగా అయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనుల్లో జాప్యం లేకుండా, ప్రజాధనం వృథా కాకుండా చూసుకోవాలి.

- ఉసిరికాయల వెంకట్‌గౌడ్, చింతలపాలెం.

కూలీల కొరత..వర్షాలతో వెత



చందంపేట మండలం సంధ్యతండాలో పత్తిచేలో పత్తి తీస్తున్న కూలీలు

గుర్రంపోడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. పంట చేతికొచ్చే దశలో కూలీలు దొరక్కపోవడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ పక్క కురుస్తున్న వర్షాలతో కుదేలవుతుంటే మరోపక్క కూలీలు దొరక్క నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతీ రోజు రైతులు కూలీల చుట్టూ తిరుగుతున్న వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. తరుచూ వర్షాలు కురుస్తుండడంతో పత్తి కిందపడి పంట చేలోనే మొలకెత్తుతోంది. మండలంలో 38 గ్రామపంచాయతీలుండగా, వాటిలో ఎనిమిది ఏఈవోలకు క్లస్టర్లు ఉన్నాయి. మండల పరిధిలోని 41,250 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. పత్తి చేతికందే సమయంలో వర్షాలురావడంతో పత్తి నల్లబారి కిందపడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత ఉండడంతో ఒక్కొక్కరికి రూ.400 చెల్లించినా కూలీలు దొరకడంలేదు. కిలో పత్తితీస్తే రూ.12నుంచి రూ.18 వరకు చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభించలేదు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా నేటికీ కేంద్రాలు తెరుచుకోలేదు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

చందంపేట మండలంలో..

చందంపేట: అధిక వర్షాలతో పత్తి రైతులు ఇబ్బందులుపడుతున్నారు. గత రోజులుగా కురుస్తున్న ఆగని వర్షాలతో పత్తి రైతులకు ఎదురు దెబ్బ తగిలింది. పత్తిచేలు నీటిలో మునిగి చాలా చోట్ల పత్తి కిందరాలి తడిసి పోయింది. ఇప్పటికే రైతులు ఎకరానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ కూలీల ఖర్చులతో రూ.18వేల నుంచి రూ. 20వేల వరకు ఖర్చు చేశారు. అధిక పెట్టుబడితో రైతులు కుదేలవుతున్నారు. దానికితోడు పత్తి తీయడానికి కూలీల ఖర్చు రోజుకు రూ.400 నుంచి 500 డిమాండ్ చేస్తున్నారు. అయినా కూలీలు దొరకడంలేదు. కూలీలు తీసే పత్తికి కిలోకు రూ. 16 నుంచి రూ.20 డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితులలో కూలీల డిమాండ్లకు తలొగ్గినా తీసిన పత్తికి తేమశాతం అధికంగా ఉండడంతో మార్కెట్ ధర కూడా రావడంలేదు. దళారులు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో రైతులపై మరింత భారంపడింది.

నీరు నిల్వకుండా చూడాలి

వర్షాల కారణంగా పత్తి, పొలాల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. బాగా ఎండ ఉన్నప్పుడే పత్తి తీసుకోవాలి. తేమశాతం ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రాదు.

ఏవో కంచర్ల మాధవరెడ్డి, గుర్రంపోడు


పెట్టుబడులు వచ్చే పరిస్థితిలేదు



నాకున్న రెండు ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఒక ఎకరానికి దాదాపు రూ.18వేల నుంచి 20వేల వరకు అయింది. పత్తిదిగుబడి బాగానే ఉన్నప్పటికీ అధిక వర్షాలు, కూలీల కొరతతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలేదు. తక్షణమే ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8వేలు అందజేయాలి.

- కేతావత్ విచ్యా, సంధ్యతండా

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దాదాపు రూ.1.60లక్షల వరకు ఖర్చయింది. పత్తిపంట తీసేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. పంట చేతికందే సమయంలో వర్షాలు రావడంతో పంట మొలకెత్తి నష్టపోతున్నాం. వర్షాల కారణంగా పత్తి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఐతరాజు కృష్ణయ్య, రైతు, కొప్పోలు

'విజ్ఞాన్' ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ టైర్-1 గుర్తింపు



వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ నాగభూషణ్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలకు జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు టైర్-1 అక్రెడిటేషన్ లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ మొదటి నుంచి విద్యా నాణ్యత, పరిశోధనలో ప్రతిభ, సామాజిక బాధ్య త అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ టైర్-1 అక్రిడిటేషన్ పొందడం ద్వారా విజ్ఞాన్ విద్యా ప్రమాణాలకు, బోధనా నాణ్యతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌బీఏ తనిఖీ బృందం 2025 ఆగస్టు 29 నుంచి మూడు రోజులపాటు విజ్ఞాన్ యూనివర్సిటీని సందర్శించిందని తెలిపారు.

నార్కట్‌పల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరమైన మాటలు మాట్లాడిన నార్కట్‌పల్లి ఎస్ఐపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి మారయ్య పోలీస్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల భూమి సమస్యలతో పోలీస్‌స్టేషన్ సంప్రదించగా ఎస్సీ కులానికి చెందిన నన్ను కులం పేరుతో దూషిస్తూ సీనియర్ సిటిజన్ అని కూడా చూడకుండా ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా మాట్లాడి మానసిక ఒత్తిడికి గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థకు మచ్చ తెస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి సీఐకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అందుకే డీఎస్పీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే పోలీస్ అధికారులు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



అధ్యాపకులకు సూచనలిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్

నార్కట్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను 90 రోజుల ప్రణాళిక మేరకు వచ్చే వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్ అన్నారు. నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉద్దేశించిన 90 రోజుల పాఠ్య ప్రణాళిక అమలుతీరును ప్రిన్సిపాల్, అధ్యాపకుల ద్వారా పరిశీలించారు. వచ్చే ఏడాదిలో జరిగే జేఈఈ, ఎప్‌సెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని సూచించారు. విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతాన్ని 28 నుంచి 31 శాతానికి పెంచినట్లు తెలిపారు. కాగా కళాశాలకు కావల్సిన కొన్ని మౌలిక వసతులు, ఇతర సమస్యలను జాయింట్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ బాలాజీ, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

కిష్టయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆలేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు జూకంటి కిష్టయ్య కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజా సంఘాల నాయకులు కోరారు. కిష్టయ్య కుటుంబాన్ని సోమవారం వారు కలిసి పరామర్శించారు. 25ఏళ్ల క్రితం ఆయన న్యూ డెమొక్రసీ పార్టీలో కొనసాగారని, అనంతరం ఆర్థిక పరిస్థితుల కారణంగా పార్టీనీ వీడి కాంగ్రెస్‌లో చేరి పార్టీ సేవకు అంకితమయ్యారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పలకల పంపిణీ

రాజాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే జ్ఞానం పెరుగుతుందని, దేశ అభివృద్ధి జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ అన్నారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జైశ్రీరాం యువజన సంఘం ఆధ్వర్యంలో పలకలను పంపిణీ చేశారు. అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి లక్ష్మణ్, కాసోజు సంపత్, డాక్టర్ రవికుమార్, అపెపు రమాదేవి, శంకర్, దాచేపల్లి శ్రీనివాస్, బిర్రు సురేష్ పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

- వెంకటాపూర్‌లో ధ్వంసమైన మురికి కాల్వలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు

తుర్కపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్ల కూల్చివేతతో పాటు ఇళ్ల ముందు ఉన్న మురికి కాల్వలు, మరుగుదొడ్లు పూర్తిగా తొలగించి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ పనులను సీ5 కాంట్రాక్టర్ రోడ్డు లెవలింగ్ చేసి కంకర పోసి నిర్మాణం పనులను మధ్యలోనే వదిలేశాడు. ఏడాదిగా మురికి కాలువలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో నుంచి వచ్చే మురికి నీరు ఇళ్ల ముందు నిలిచి పోవడంతో మురికి గుంతలు ఏర్పడి తీవ్రమైన దుర్వాసన రావడంతో పాటు ఈగలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఇళ్ల ముందు కంకర పోయడంతో ఇళ్లలోకి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం ఈ కాలనీవాసులకు మురికి కాల్వల నిర్మాణ పనులు చేపట్టేందుకు సంబంధిత పైపులు కూడా తెప్పించారు. కానీ పనులు ప్రారంభించ లేదు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్ట ప్రధానాలయ ఉద్ఘాటన కార్యక్రంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు దేవస్థానం చుట్టూ ఉన్న గ్రామాల్లో రోడ్ల విస్తరణ, మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా తుర్కపల్లి నుంచి యాదగిరిగుట్ట వరకు ఉన్న 15.4కి.మీ రోడ్డు, తుర్కపల్లి మండలం వాసాలమర్రి నుంచి కొండాపూర్ వరకు 4.6కిలోమీటర్ల ఉన్న రోడ్డును నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం సుమారు రూ.80కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పటి ఎమ్మెల్యే గొంగడి సునీత 2020 సంవత్సరంలో అట్టి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు సీ5 సంస్థ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. తుర్కపల్లి-యాదగిరిగుట్ట నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్న పనులు మాత్రం పూర్తి కాలేదు. రోడ్డు డివైడర్‌కు ఒకవైపు రెండు లేన్ల రోడ్డును పూర్తి చేశారు. కానీ మరో వైపు ఉన్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఒక వైపు నుంచే వాహనాలు నడుస్తున్నాయి. రోడ్డు నిర్మాణం పనులు అసంపూర్తిగా చేపట్టడడంతో ఎంతో మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.





మురికి కాల్వ లకపోవడంతో నిలిచిన నీరు, అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనులు

ఇళ్ల ముందే నిలుస్తున్న మురికినీరు

మండలంలోని వెంకటాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా 30 నుంచి 40 ఇళ్లు ఉంటాయి. నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొంత మంది ఇళ్లు సగానికి కట్టయ్యాయి. రోడ్డుపైకి కాగా ఇళ్లు రోడ్డుకు కిందికి అయ్యాయి. అంతే కాకుండా గతంలో పంచాయతీ ఏర్పాటు చేసిన మురికి కాలువలు పూర్తి ధ్వంసం అయ్యాయి. దీంతో ఇళ్ల నుంచి వెలువడే మురికి నీరు ఇళ్ల ముందే నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి మురికి కాలువల నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్ల నుంచి వెలువడే మురికి నీరు ఇళ్ల ముందే నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి మురికి కాల్వల నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి



రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిపి వేయడంతో కాలనీ వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్‌కు సుమారు 20 లీకేజీలు ఉండడంతో రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో రోడ్డు నిర్మాణ పనులు, మురికి కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయించి, గ్రామస్తుల ఇబ్బందులను తొలగించాలి.

-కల్లూరి ప్రభాకర్‌రెడ్డి మాజీ సర్పంచ్ గ్రామం, వెంకటాపూర్

త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం



తుర్కపల్లి - యాదరిగుట్ట నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో ఇంకా కేవలం 10శాతం పనులు నిలిచిపోయాయి. తుర్కపల్లి, వెంకటాపూర్, మల్లాపూర్ గ్రామాల్లోనే కొంత పని చేయాల్సి ఉంది. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగతా రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. రోడ్డు వెంబడి ధ్వంసమైన మురికి కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

- కరుణాకర్, ఆర్అండ్‌బీ ఏఈ

చెట్లను నరికిన వారిపై డీఎఫ్‌వోకు ఫిర్యాదు

భువనగిరి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామ శివారులోని త్రిల్లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో చెట్లను నరికిన దేవాలయ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామ ఉప సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులు సోమవారం త్రిల్లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సుమారు రూ.20వేల విలువ గల చెట్లను అక్రమంగా నరికిన ప్రాంతాన్ని పరిశీలించి, డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశారు. కాగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకునేందుకు దాదాపు 20వేల మంది భక్తులు వస్తుంటారు. ప్రతి ఏటా భకుతలు ఆ చెట్ల కిందనే సేదదీరేవారన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

బొమ్మలరామారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ఐకేపీ సెంటర్ వద్ద ధాన్యాన్ని ఆరబోసుకొని 20 రోజులు అవుతున్నా అధికారులు రైతుల ధాన్యం గుర్తించి పట్టించుకోవడం లేదన్నారు. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌తో కలిపి ఇవ్వాలని కోరారు. రెండు రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయని పక్షంలో ధాన్యాన్ని అంతా ఎమ్మార్వో ఆఫీస్‌కి తీసుకుని వస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రమేష్, భిక్షపతి పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

రామన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో నవంబర్ 8న జరిగే సీఐటీయూ 4వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నకిరేకంటి రాము, రాష్ట్ర కమిటి సభ్యులు బందెల బిక్షం, రోడ్డు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పం సురేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంగాల మారయ్య, హమాలీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూడిద బిక్షం పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

వలిగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన దుబ్బ లలిత చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో రూ. 5వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారుల సమీపంలో వైన్స్‌లను నిషేధించాలి



కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేస్తున్న వివిధ యువజన సంఘాల ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యాటక కేంద్రంగా, సిల్కుసిటీగా పేరొందిన భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన వైన్స్ దుకాణాలను వెంటనే ఎత్తివేయాలని, నూతనంగా మంజూరైన వైన్స్‌లను పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసేట్లు చర్యలు తీసుకోవాలని నేతాజీ యువజన సంఘం, వివేకానంద యువజన సంఘం, కల్లుగీత పారిశ్రామిక సంఘం, చేనేత కార్మిక సంఘం, పద్మశాలి మహాజన సంఘం, పద్మశాలి చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం గౌరవ సలహాదారులు సాయ బాలయ్యగౌడ్, అధ్యక్షుడు గునిగంటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శెట్టి శ్రీనివాస్ ముదిరాజ్, కోశాధికారి వంగూరి రాజు, గౌరవ సభ్యులు బొడిగె లింగంగౌడ్, కల్లు గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గునిగంటి మల్లేష్‌గౌడ్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, ప్రతినిధులు గుండు పాండు, గౌడ సంఘం జిల్లా నాయకుడు కొయ్యడ నర్సింహగౌడ్, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యువజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి

వలిగొండ, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : వలిగొండలో నవంబర్ 2న జరిగే యువజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ సీపీఎం అనుబంధ సంఘాల్లోని 35 సంవత్సరాలలోపు యువతీ యువకుల మండల స్థాయి యువజన సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో యువతీ యువకులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కులం, మతం, పేర్లతో విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఉద్యోగాలను కల్పించకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మండల కమిడు సభ్యులు సురేష్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నాయకులు గణపతిరెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, మణెమ్మ, స్వామి, నర్సింహ, నగేష్, పాపయ్య, సత్తయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి

వలిగొండ, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో గాయత్రి పాఠశాలలో విద్యార్థులకు సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో పరిచయం చేసుకొని చాటింగ్‌లు, మీటింగ్‌లతో జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడుతూ తల్లిదండ్రుల మాట గౌరవించాలన్నారు. సమాజంలోని తోటివారందరినీ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమస్యలపై వినతి పత్రాన్ని అంజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి, నాయకులు బుగ్గ లక్ష్మయ్య, అంజమ్మ, సాలమ్మ, కవిత, భూలక్ష్మీ, సరస్వతి పాల్గొన్నారు.

ప్రజా రక్షణకు ప్రాణత్యాగం చేస్తున్న పోలీసులు

చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షణ కల్పించే క్రమంలో పలువురు పోలీసులు ప్రాణత్యాగం చేశారని చౌటుప్పల్ సీఐ కే.మన్మథకుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సోమవారం చౌటుప్పల్‌లోని జాతీయ రహదారిపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టానికి ప్రతి ఒక్కరూ సమానమేనని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సంఘ వ్యతిరేక శక్తులతో కఠినంగా వ్యవహరిస్తామని, విధి నిర్వహణలో పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కే.యాదగిరి, డీ.నర్సిరెడ్డి, కే.ఉపేందర్‌రెడ్డి, అజయ్‌భార్గవ్, సీహెచ్.రమేష్, కృష్ణమాల్, ఏఎస్‌ఐలు జానయ్య, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. వారి సేవలను నిరంతరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రామన్నపేటలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అమరవీరుల సేవల గురించి, వారు చేసిన త్యాగము గురించి వివరించారు. ర్యాలీగా వెళ్లి శోభనాద్రిపురం వెళ్ళే చౌరస్తాలో ఉన్న పోలీస్ అమరుగు ఇంజమూరి లింగయ్య విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నాగరాజు, పోలీసు అధికారులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఏఎస్ఐ ఎం.సురేందర్, సిబ్బంది రాంబాబు, కమలాకర్, డి.స్వామి, లింగస్వామి, కవిత, రామన్నపేట మండల నాయకులు అక్రమ్, పృథ్వి, జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మోత్కూరులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మోత్కూరు: పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి అని మోత్కూర్ పోలీస్‌సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం మోత్కూరు పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏ.ఎస్ఐ వెంకన్న , హెడ్ కానిస్టేబుల్ నర్సింహ వెంటేశ్వర్లు, కానిస్టేబుల్ మహేష్, శివ, నవీణ్, శ్రీను, ఉస్సేన్, కవిత శ్యాంరీన తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతాం'

భువనగిరి గంజ్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యూనిటీ కళాశాలలలో విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతామని కళాశాలల గ్రూప్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణ పరిధి రాయగిరి యూనిటీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయన మాట్లాడుతూ గత పదహారేళ్లు విజ్ఞానవంతులుగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం తీర్చిదిద్దుతోందన్నారు. పారిశ్రామికంగా ఎదిగేందుకు ఎంబీఏ కోర్సుతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించిందన్నారు. సమాజ శ్రేయస్సుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. కళాశాల డైరెక్టర్లు సోమ చందు, పి.గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎంఎస్.సరిత, డాక్టర్ అంబటి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలను చేయగా ఏవోపీ సునీత, హెచ్ వోడీ జి సురేష్, అధ్యాపకులు వి.రాధా, సంపత్, నాగరాణి, డీవీ.యమున, ఉమ, క్రాంతి, లత, అనూష పాల్గొన్నారు.

తుర్కకాశ సంక్షేమ సంఘం మండల కమిటీ ఎన్నిక

రాజాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుర్కకాశ సంక్షేమ సంఘం మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం తెలిపారు. మండల అధ్యక్షుడిగా షేక్ ఖాసిం, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ చాంద్‌పాషా ఎన్నికయ్యారు.

ప్రజల దరికి పాలన

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటూ పరిపాలనాపర సంస్కరణలు తీసుకువస్తున్నాం. దినపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మొదటిస్థానం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపాం. ఇళ్ల మంజూరు పత్రాలు అర్హులైన పేదవారికి పారదర్శకంగా అందజేసి, జిల్లాలో నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. అర్హులైన లబ్ధిదారులకే పథకం వర్తించేలా చూడటంతోపాటు నిర్మాణాలు త్వరగా చేపట్టేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నిర్మాణానికి డబ్బు లేక కొందరు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు సమభావన సంఘాల నుంచి రుణాలు అందజేశాం.

గ్రామాల్లో పల్లె నిద్ర, ఉద్యోగవాణికి శ్రీకారం

పల్లె నిద్రలో భాగంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. గ్రామసభ నిర్వహించి ఒకే వేదిక ద్వారా అన్ని సమస్యలు తెలుసుకొని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి, ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగవాణి నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సమస్యలు కూడా తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నాం.

సంక్షేమానికి పటిష్ట చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేస్తూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. బాలింతలకు పౌష్టికాహారం అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. 'అమ్మకు భరోసా' వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అందులో భాగంగా గర్భిణులు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా న్యూట్రిషన్ కిట్, మందులు అందజేస్తున్నాం. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉద్దేశంతో జిల్లాలోని మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల కేటాయింపు చేశాం. వారు విజయవంతంగా కొనుగోళ్లను పూర్తిచేసేలా ప్రణాళిక అమలు చేస్తున్నాం. పలువురు మహిళలతో క్యాంటీన్లు, ఇతర ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయించాం. స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, కమిషన్ డబ్బు ఇప్పించాం. ఇలా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

(5వ పేజీ తరువాయి)

తీసుకొని వచ్చారు. మొబైల్ ఫోన్లను హాల్‌లోనికి అనుమతించలేదు. దీంతో అందరీ ఎంట్రీపాస్‌ను పరిశీలించాకే అనుమతించారు. సుమారు 2వేలకు మందికి పైగా హాల్‌కు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, రామన్నపేట ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎల్లంబావి మద్యం దుకాణానికి అత్యధికంగా 91 దరఖాస్తులు రాగా, వలిగొండ మండలం ఆరూర్‌లోని షాపుకు 83 దరఖాస్తులు వచ్చాయి. గతం కంటే ఈసారి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ప్రక్రియ ప్రారంభంకాగానే వ్యాపారులంతా ఉత్కంఠగా ఎదురుచూశారు. ఒక్కో దుకాణం వారీగా అధికారులు డ్రా నిర్వహించారు. డ్రా పూర్తిగా పారదర్శకంగా ఉండేందుకు ఫొటో, వీడియో చిత్రీకరణ చేశారు. లాటరీ ప్రక్రియ పూర్తి కాగా, దుకాణాలు దక్కినవారు ఆనందం వ్యక్తం చేయగా, దుకాణాలు దక్కని వారు నిరాశగా వెనుదిరిగారు. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఏడాది లైసెన్స్ ఫీజులో 1/6వంతు చెల్లించి ప్రొవిజినల్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. అందుకోసం ప్రత్యేకంగా పలు బ్యాంకులతో కౌంటర్లు కూడా ఏర్పాటు చేశారు. లాటరీ ద్వారా ఎంపికైన వ్యాపారులు లైసెన్సు ఫీజులో ఆరో వంతు తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి తెలిపారు. ఇదిలా ఉండగా, కేవలం దరఖాస్తు ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.83.28కోట్ల ఆదాయం సమకూరింది.

లక్కీ యువతి

నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని బొమ్మలరామారం మండలం దుకాణం నెంబరు-22ను కె.శరణ్య అనే యువతి డ్రాలో దక్కించుకుంది. గుంపులో కూర్చున్న ఆ యువతికి చెందిన నెంబరు లాటరీలో రావడంతో ఆమె ఆనందంలో మునిగితేలింది. గుంపు నుంచి పరుగున వేదిక వద్దకు వచ్చి విజయదరహాసం చేసింది. అక్కడ ఉన్న మద్యం వ్యాపారులంతా ఒక్కసారిగా లక్కీ...లక్కీ.. మహాలక్ష్మి అంటూ కొనియాడారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



దేశ్‌ముఖి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు సామ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దానయ్య, మాజీ సర్పంచులు డి.అనితజంగయ్య, చిల్లర జంగయ్యయాదవ్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

రాజాపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం రేణుకుంటలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పొగాకు రహిత యువత కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకుతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు, గ్రామాన్ని పొగాకు రహిత గ్రామంగా మార్చేందుకు కృషి చేస్తామని గ్రామస్థులు ప్రతిజ్ఞ జేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బీకునాయక్, విజయలక్ష్మీ, ఉపేందర్, కవిత, మహేష్ పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలు చేస్తే చర్యలు తప్పవు

రాజాపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తూకాల్లో మోసాలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల అధికారి కందగట్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం తూనికలు, కొలతల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిరాణ దుకాణాలు, రైస్‌మిల్లులు, బంగారు నగల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.



కిరాణదుకాణంలో తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారులు